రక్షణ రంగంలో యువతకు అపార అవకాశాలు

మాట్లాడుతున్న కర్నల్ అనిల్ కుమార్, వేదికపై ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి తదితరులు

- కర్నల్ అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

బొమ్మలరామారం, జనవరి9 : రక్షణ రంగంలో యువతకు అపార అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ గ్రూప్ కమాండర్, కర్నల్ అనిల్ కుమార్, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలో గల హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ జూనియర్ కాలేజీలో గురువారం సీనియర్ స్టూడెంట్స్‌కు ఫేర్‌వెల్ పార్టీ జరిగింది. ఈ దీనికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తిస్తూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని అన్నారు. లక్ష్య సాధనకు నిరంతరం సాధన చేయాలని తెలిపారు. యువత తాత్కాలిక ఆకర్షణకు గురికాకుండా మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జూనియర్ కాలేజీ చైర్మన్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ అంజయ్య, డీన్ ఆర్‌కే రావు, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ నవ్య శ్రీ, రిటైర్డ్ కర్నల్ ఎస్‌కే దాస్, ప్రణయ్ సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపిక, క్రమ శిక్షణే గొప్ప ఆయుధాలు

- టీపీడీఈఏ రాష్ట్ర సెక్రటరీ జనరల్ బీసీరెడ్డి

టీపీడీఈఏ-2025 డైరీని ఆవిష్కరిస్తున్న సభ్యులు

యాదగిరిగుట్ట, జనవరి9 : సహనం, ఓపిక, క్రమశిక్షణే గొప్ప ఆయుధాలని, వాటిని అతిక్రమించకూడదని టీపీడీఈఏ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.బీసీరెడ్డి అన్నారు యాదగిరి గుట్ట పట్టణంలోని అతిథి గృహంలో గురువారం టీపీడీఈఏ-2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి విద్యుత్ సంస్థలో పనిచేసే పవర్ డిప్లొమా ఇంజినీర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని 29 రాష్ట్రాల విద్యుత్ సంస్థలన్నింటి కంటే రాష్ట్రంలో పనిచేసే ఇంజనీర్లు, సిబ్బందికి అత్యధిక వేతనాలు పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆర్థిక కార్యదర్శి నరేశ్, ఉత్తర, దక్షిణ కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, మనోరంజన్ రెడ్డి, సుబ్రమణ్యేశ్వరరావు, తాజుద్దీన్ బాబా, రాష్ట్ర నాయకులు మదుసూదన్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చలపతిరావు, నరేందర్, 33 జిల్లాల టీపీడీఈఏ అధ్యక్ష, కార్యదర్శులు, సబ్ ఇంజినీర్లు, ఏఈలు, ఏడీఈలు తదితరులు పాల్గొన్నారు.

కొండమడుగులో వార్డులు, ఎంపీటీసీ స్థానాలను పెంచాలని వినతి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీబీనగర్, జనవరి 9 : మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న కొండమడుగులో వార్డు, ఎంపీటీసీ స్థానాలను పెంచాలని కోరుతూ గ్రామానికి చెందిన పులువురు నాయకులు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండమడుగులో పెరిగిన జనాభా, ఓట్లను పరిగణనలోకి తీసుకొని పరిపాలనా సౌలభ్యం కోసం రెండు ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేయాలని, వార్డుల సంఖ్యను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడెం చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ కనకబోయిన గోపాల్, బీఆర్ఎస్ బీబీనగర్ మండలం ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు కనకబోయిన రాజ మల్లేశ్, చిన్నగల్ల అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

చౌటుప్పల్, జనవరి 9 : మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో జాతీయ స్థిర విద్యుత్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పాలకూర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గురువా రావు, ఫౌండేషన్ చైర్మన్ పాలకూర్ల మురళి గౌడ్, ప్రముఖ సాహితీ వేత్త బడుగు శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 9 : ఈ నెల 11న కలెక్టర్ కార్యాలయంలో ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30గంటలకు నిర్వహించే కార్యక్రమంలో బీసీ కుల సంఘ నాయకులు,అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 9 : మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి వరకు ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఇతర విద్యార్థులు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. పరీక్ష హాల్ టికెట్లు ఏప్రిల్ మూడో 3 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. 6వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అడ్మిషన్ టెస్టు నిర్వహిస్తారని తెలిపారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు.. నగలు స్వాధీనం

నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు చూపిస్తున్న పోలీసులు

భువనగిరి అర్బన్, జనవరి 9 : తాళం వేసిన ఇంటిలో చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గురువారం పట్టణ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొమరగిరి యాకూబ్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉండేవాడు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కేంద్రానికి చెందిన అలకుంట్ల మునిస్వామి పట్టణంలోని అర్బన్ కాలనీలో ఉంటున్నాడు. భువనగిరి పట్టణంలో ఇద్దరు కూడా చెత్త సేకరించేవారు. ఈ సమయంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. వీరిద్దరు కలిసి ఓ ఇంట్లో చోరీకి పాల్పడాలని పథకం పన్నారు. ఈ నెల 7న రాత్రి పట్టణంలోని మెయిన్ రోడ్డుపై ఓ ఇంటి తాళం పగులగొట్టి చొరబడ్డారు. బీరువా పగులగొట్టి అందులోని బంగారు ఆభరణాలు, నగదును అపహరించుకుపోయారు. పట్టణ పోలీసులు గతంలో దొంగతనాలకు పాల్పడిన వారిపై నిఘా పెట్టగా అలకుంట్ల మునిస్వామిపై యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో 8 కేసులు ఉన్నాయి. అతనిపై నిఘా పెట్టగా అతనితో కలిసి తిరుగుతున్న కొమరగిరి యాకూబ్‌పై అనుమానం వచ్చింది. దీంతో యాకూబ్‌పై ప్రత్యేక నిఘా పెట్టగా కొమరగిరి యాకూబ్ యాదగిరిగుట్ట లోని బస్టాండ్‌లో మద్యం సేవించి నిద్రపోయాడు. నిద్రించిన తీరు, అతనిపై అనుమానంతో యాకూబ్‌ను పోలీసులు విచారణ చేపట్టగా చోరీకి పాల్పడిన విషయాన్ని బయటపెట్టాడు. దాంతో అలకుంట్ల మునిస్వామితో పాటు కొమరగిరి యాకూబ్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద రెండు తులాల బంగారు పుస్తెల తాడు, తులం గొలుసు, తులం విలువ గల రెండు ఉంగరాలు, తుల చెవి రింగులు, రూ.12వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

రేషన్ కోసం తిప్పలు

- కొత్త పంచాయతీలుగా మారినా ఏర్పాటు కాని రేషన్ దుకాణాలు
- కొండ్రెడ్డి చెరువు, కొత్తజాల, మల్లెగూడెం గ్రామాల ప్రజలకు దూరభారం

రేషన్ బియ్యం నెత్తిన పెట్టుకొని కాలినడకన వెళ్తున్న కొత్తజాల గ్రామస్తులు

రాజాపేట, జనవరి 9 : మండలంలోని కొండ్రెడ్డి చెరువు, కొత్తజాల, మల్లెగూడెం గ్రామాల ప్రజలు రేషన్ సరుకుల కోసం తిప్పలు తప్పడం లేదు. ఈ మూడు గ్రామాలకు నూతన గ్రామ పంచాయతీలు సైతం ఏర్పాటయ్యాయి. కానీ ఇక్కడ ప్రత్యేక రేషన్ షాపులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి నెలా రేషన్ సరుకుల కోసం ఇబ్బందులు తప్పడం లేదు. రేషన్ సరుకుల కోసం రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులైతే రేషన్ సరుకులు తీసుకురావడానికి నరకయాతన పడుతున్నారు. ఆయా గ్రామాల్లో నూతన రేషన్ షాపులు మంజూరు చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

- నమస్తే కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులు

రాజాపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

రాజాపేట, జనవరి 9 : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ సమీపం రైతు వేదిక వెళ్లే దారిలో విరిగిన స్తంభంపై నమస్తే తెలంగాణలో గురువారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. విరిగిన స్తంభం వద్ద మరో స్తంభం ఏర్పాటు చేశారు. విరిగి వంగిన స్తంభాన్ని త్వరలో తొలగించనున్నట్లు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు.

ఆర్థిక సాయం

రాజాపేట, జనవరి 9 : మండలంలోని కాల్వపల్లికి చెందిన పెంట రామస్వామి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఇంజ ఫౌండేషన్ చైర్మన్ ఇంజ నరేశ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రాజాపేట నెమిల క్రాస్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజాపేట, జనవరి 9 : మండలంలోని నెమిలే క్రాస్ రోడ్ వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్లు, బైకులు, ఆటోలను ఆపి వాహనాల పత్రాలు, ఇన్సూరెన్స్, లైసెన్స్ పరిశీలించారు. లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా వెళ్లే వాహనదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ సాయి, ఏఎస్ఐ నాయుడు, పోలీస్ సిబ్బంది రాజు, శ్రీను ఉన్నారు.

'20న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి'

భువనగిరి కలెక్టరేట్, జనవరి 9 : ఈ నెల 20న నిర్వహించనున్న కలెక్టర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని అండర్ పాస్ సాధన కమిటీ అధ్యక్షుడు మజ్జిగ శ్రీనివాస్ గురువారం విలేకరుల సమావేశంలో కోరారు. భువనగిరి మండలంలోని బండ సోమారంలో ప్రధాన రహదారిపై అండర్‌పాస్ లేక వాహనదారు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాన కార్యదర్శి సిలివేరు అశోక్, సిలివేరు ఎల్లయ్య, కంచు మల్లయ్య, మద్దిటి సిద్దారెడ్డి, సిలివేరు మధు, అశోక్, శంకర్‌రెడ్డి, బలరాం, కుమార్, బాల్‌రాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ మెడికల్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీత భాస్కర్

సీత భాస్కర్

భూదాన్‌పోచంపల్లి, జనవరి 9 : మండల ఫస్ట్ ఎయిడ్ మెడికల్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూదాన్ పోచంపల్లికి చెందిన సీత భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ కేంద్రంలో గురువారం ఎన్నికల అధికారి జల్లా వెంకటేశం ఆధ్వర్యంలో మండల ఫస్ట్ ఎయిడ్ మెడికల్ హెల్త్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కడవేరు వెంకటాద్రి, సురపల్లి బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా వేముల రాఘవేందర్, సహాయ కార్యదర్శులుగా చిక్క మంగ, కళందాస్ గోవర్ధన్, కోశాధికారిగా ఏలె హరిశంకర్, గౌరవ అధ్యక్షులుగా రుద్ర ధనుంజయ, గౌరవ సలహాదారులుగా చిలువేరు రాములు, వేముల వెంకటేశం, సభ్యులుగా ఆడెపు సిద్ధులు, బత్తుల ఉపేందర్, చిన్నపాక యాదగిరి, నరసింహారావు, కామెడీ మహేశ్‌ను ఎన్నుకున్నారు.

స్వర్ణగిరిలో పది రోజులపాటు వైకుంఠ ఏకాదశి వేడుకలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్తలు

యాదాద్రి భువనగిరి, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి క్షేత్రంలో పది రోజుల పాటు వైకుంఠ ఏకాదశి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మానేపల్లి మురళీకృష్ణ, గోపీకృష్ణ, ప్రధాన అర్చకుడు శ్రవణ్ అయ్యగారు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గురువారం భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయంలో వైకుంఠం వాతావరణాన్ని భక్తులకు కల్పిస్తామన్నారు. పది రోజుల్లో పది లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, రద్దీకి తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలీస్, ట్రాఫిక్, ఫైర్, వైద్య అధికారుల సమన్వయంతో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా నాలుగు జోన్లుగా విభజించామని చెప్పారు. నిత్యం పదివేల మందికి అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు మంచి నీరు, మజ్జిగ, స్నాక్స్ అందిస్తామని చెప్పారు. వెయ్యి మంది వరకు వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దర్శనం టికెట్లు అందుబాటులో ఉన్నాయని, టైమ్ స్లాట్ ప్రకారం దర్శనం కల్పిస్తామని, వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు చూడవచ్చని తెలిపారు.

'జిట్టా విగ్రహావిష్కరణకు తరలిరావాలి'

భువనగిరి అర్బన్ : జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వలిగొండ, జనవరి9 : తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు, భువనగిరి ముద్దు బిడ్డ స్వర్గీయ జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణకు జిట్టా అభిమానులు భారీగా తరలిరావాలని మాజీ ఎంపీపీ బడుగు సత్యనారాయణ పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణ కేంద్రంలో ఈ నెల 12న ఆవిష్కరించనున్న జిట్టా బాలకృష్ణారెడ్డి కాంస్య విగ్రహరణ వాల్‌పోస్టర్‌ను గురువారం వలిగొండలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిట్టా అభిమానులు చిలుగూరి సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, సాయిని యాదగిరి, బత్తిని రవీందర్, నానచర్ల రమేశ్, మస్క నరిసింహ, కొండూరి సత్తయ్య, ఎండీ రవూఫ్, మత్స్యగిరి, స్వామి, యాదగిరి, రవి పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిట్టా అభిమానులు మైసగోని వెంకటేశం, ముద్దం సత్యంయాదవ్, బాలం రామకృష్ణ, చేరాల నిఖిల్, చిన్నలచ్చి లింగస్వామి, రామిడి నరేందర్‌రెడ్డి, కొమ్ము భాను చందర్, రామిడి యాదిరెడ్డి, దుర్గం జంగయ్య, బాలమైసి నవీన్‌కుమార్, చందు పాల్గొన్నారు.

వలిగొండ : జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆయన అభిమానులు

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామ పంచాయతీ కార్మికులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 9 : మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మంచాల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు గత 3 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, దాంతో కుటుంబాలను పోషించలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. కార్మికులకు 8,500 రూపాయలు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం దోచుకుంటుందని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు బాబు, స్వామి, శంకర్, సలీం, జయమ్మ, శారద, పాల్గొన్నారు.

'19న మాదిగల మహా గర్జనను విజయవంతం చేయండి '

కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 9 : ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19 హైదరాబాద్‌లో జరిగే మాదిగల మహా గర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూషి మహేశ్‌మాదిగ, రాష్ట్ర కార్యదర్శి భైరపాక నాగరాజు కోరారు. పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం మహా గర్జన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వడ్డేపల్లి యాదగిరి, నల్ల నరసింహ, పెద్దల ముత్యాలు, మీసాల బాలయ్య, కరగల్ల బాలనరసింహ, గురు బాలయ్య, సోమయ్య, రత్నం, మల్లేశ్, సుభాశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన బైక్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చౌటుప్పల్, జనవరి 9 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చౌటుప్పల్ మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా కేంద్రం పానగల్‌కు చెందిన చింత దిలీప్ తన సమీప బంధువైన నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన సుక్క శ్వేతను తన బైక్‌పై ఎక్కించుకొని వెళ్తుండగా, రోడ్డుపై ఆగివున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఎస్ఐ సూర కృష్ణామాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మకూరు మండల అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

డబుల్ రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూరు(ఎం), జనవరి9 : మండలంలోని అన్ని గ్రామాలను విడుతల వారీగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రధానరోడ్డు నుంచి ఉన్నత పాఠశాల వరకు రూ.1.75 కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు, అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణం పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం బిక్కేరువాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ప్రారంభించి వీర్ల చెరువులోకి వచ్చిన గోదావరి జలాలకు పూజలు నిర్వహించారు. మండలంలోని మొరిపిరాల, సింగారం గ్రామాల్లో బీటీ, సీసీరోడ్డు నిర్మాణాల కోసం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బునాదిగాని కాల్వ పనులను పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విమల, మాజీ ఎంపీపీ మంగమ్మ, మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్, ఎంఈఓ మహదేవరెడ్డి, ఐబీ, ఆర్‌అండ్‌బీ డీఈలు సునీల్ ప్రసాద్, మంగ్లనాయక్, మాజీ సర్పంచ్‌లు జన్నాయికొడె నగేశ్, యాస లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలి

- డీఈఓ సత్యనారాయణ

ఆత్మకూరు(ఎం) : కూరెళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ సత్యనారాయణ

ఆత్మకూరు(ఎం), జనవరి9 : ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రతి విద్యార్థికి చదవడం రాయడం నేర్పించాలని, సమయపాలన పాటించాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. మండలంలోని కూరెళ్ల, పల్లెర్ల గ్రామాల్లో గురువారం ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. హాజరు రిజిస్టర్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి విద్యార్థులందరూ వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వారానికి మూడు సార్లు కోడిగుడ్డు అందివ్వాలని తెలిపారు. పెరిగిన కోడిగుడ్ల ధరలకు అనుగుణంగా బిల్లులు ఇవ్వాలని, వేతనాలు కూడా పెంచాలని వంట ఏజెన్సీలు ఈసందర్భంగా డీఈఓను కోరారు. ఆయన వెంట హెచ్ఎంలు దామోదర్, శ్రీనివాస్‌రావుతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

అవమానం భరించలేక వివాహిత ఆత్మహత్య

- న్యాయం చేయాలని బంధువుల రాస్తారోకో

రాపోలు రమ్య (ఫైల్)

రామన్నపేట, జనవరి9 : బంగారం దొంగతనం చేసిందని నిందను మోపడంతో అవమానం భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాపోలు నరేశ్, రమ్యలది మధ్య తరగతి చేనేత కుటుంబం. వీరికి ఇద్దరు సంతానం. ఈ నెల 5న రాపోలు రమ్య(31) హయత్‌నగర్ మండలం మునగనూరు రామానుజకాలనీలో నివాసం ఉండే మేలిడి మానస కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరైంది. అదే వేడుకలకు జంగిలి మురళి కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. ఆ రోజు రాత్రి అక్కడే పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం రమ్య తన స్వగ్రామం సిరిపురం చేరుకుంది. సాయంకాలం మానస.. రాపోలు నరేశ్‌కు ఫోన్‌చేసి జంగిలి మురళివాళ్లకు చెందిన బంగారం పోయిందని, మీకైమైనా దొరికిందా అని అడిగింది. కొద్దిసేపటి తర్వాత జంగిలి మురళి ఫోన్‌చేసి రమ్యనే బంగారం దొంగతనం చేసిందని గట్టిగా వాదించి హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. దీంతో హయత్ నగర్ పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్‌కాల్ రావడంతో భార్య భర్తలు ఇద్దరు వెళ్లి పోలీసులను కలిశారు. ఎస్ఐ సమక్షంలోనే మురళి గట్టిగా దబాయించి మాట్లాడి రౌడీలతో కొట్టిస్తానని బెదిరించాడు. దీంతో అవమాన భారంతో రమ్య మానసిక ఆందోళనకు గురైంది. తిరిగి గురువారం రమ్మని పోలీసులు చెప్పడంతో అవమానం భరించలేక గురువారం తెల్లవారు జామున తన ఇంట్లోనే రంగులకు అద్దె రసాయనం నైట్రాఫ్‌ను తాగి ఆత్మహత్యకు పాల్పడింది. భర్తకు విషయం తెలుపగా రామన్నపేట దవాఖానకు అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రమ్య మృతి చెందింది. దీంతో మృతురాలి భర్త నరేశ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

హయత్‌నగర్ ఎస్ఐ బెదిరింపులతోనే..

తన భార్య మృతికి కారణమైన జంగిలి మురళిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నరేశ్ కోరాడు. హయత్ నగర్ ఎస్ఐ సైద